# శివన్నగూడెం ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం

## నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం
## రాజగోపాల్‌రెడ్డి మునుగోడుకు ఏం చేసిండో చెప్పాలి
## ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
## మర్రిగూడ, గట్టుప్పల మండలాల్లో ప్రచారం



మర్రిగూడ : దామెర భీమనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో గీత కార్పోరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్

మర్రిగూడ, నవంబర్ 15 : రూ. 2వేల కోట్లతో నిర్మిస్తున్న శివన్నగూడెం, లక్ష్మణాపురం ప్రాజెక్టులను పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని మునుగోడు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి అవుతారని, దాంతో ప్రాజెక్టులు తొందరగా పూర్తవుతాయని స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని కొట్టాల, మేటిచందాపురం, సరంపేట, లెంకలపల్లి, కమ్మగూడెం, దామెరభీమనపల్లి, వట్టిపల్లి, రాజపేటతండా, మర్రిగూడ, కొండూరు గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఈ ప్రాంత వాసినని, అందుకే మునుగోడు నియోజకవర్గమన్నా, ఇక్కడి ప్రజలన్నా తనకు ఎనలేని ప్రేమ అన్నారు. ఎక్కడి నుంచో ఇక్కడికి వచ్చి కేవలం ఎన్నికల వరకు ఉండి పోయే రాజగోపాల్‌రెడ్డి లాంటి వాళ్లకు ప్రజలంటే ప్రేమ ఉండదన్నారు. తనకు సొంత పనులంటూ ఏమీ లేవని, మునుగోడు అభివృద్ధి, ఇక్కడి ప్రజల సంక్షేమమే తన పని అని పేర్కొన్నారు. ఉప ఎన్నిక తర్వాత వందల కోట్ల నిధులు తీసుకొచ్చి గ్రామాలను అభివృద్ధి చేశానన్నారు. ఉప ఎన్నికలో ఇచ్చిన హామీ మేరకు గట్టుప్పలను మండలంగా, చండూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. మర్రిగూడ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించుకున్నామన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, గ్రామాలను కలుపుతూ లింకురోడ్లు, బీటీ రోడ్లు వేసే పనులు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజలు మరో సారి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

### రాజగోపాల్ రెడ్డి ఏం చేసిండో చెప్పాలి..

కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడుకు ఏం చేసిండో చెప్పిన తర్వాతే ప్రజలను ఓట్లు అడగాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల అన్నారు. ఎంపీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన ఈ ప్రాంతంలో ఒక్క అభివృద్ధి పనికి కూడా కొబ్బరికాయ కొట్టిన పాపాన పోలేదన్నారు. తన కాంట్రాక్టులు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేయడానికి తప్ప ప్రజలకు సేవ చేసేందుకు ఆయన పనికిరాడన్నారు. కాంగ్రెస్ పార్టీ సచ్చిపోయిందని, తెలంగాణలో ఆ పార్టీ లేచే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రూ.18 వేల కోట్లకు బీజేపీకి అమ్ముడుపోయిన వ్యక్తి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని మళ్లీ ప్రజలను ఓట్లు అడుగుతున్నాడని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు అధికారం కోసం రాష్ట్రాన్ని అంధకారంలో నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అవసరం లేదని 3 గంటలే చాలని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల మధ్య ఉండి పని చేసే వారికే ఓటు వేయాలని కోరారు. అభివృద్ధి కొనసాగేందుకు బీఆర్ఎస్‌ను మరో మారు గెలిపించాలని కోరారు.

### కారును మర్చిపోతే గోస పడుతాం

సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని, రాష్ట్ర ప్రజలు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. కారు గుర్తును మర్చిపోతే గోసపడుతామని పేర్కొన్నారు. మునుగోడు ఎమ్మెల్యేగా తనను గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా అధికారంలోకి రాగానే ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలకు తోడు మరిన్ని పథకాలు అమలు చేయనున్నామన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని నెరవేరుస్తామని పేర్కొన్నారు.

### బీఆర్ఎస్‌తోనే ప్రాజెక్టులు పూర్తి : పల్లె రవికుమార్

మునుగోడు నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మిస్తున్న శివన్నగూడెం, లక్ష్మణాపురం ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని గీత కార్పోరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. ఫ్లోరైడ్ మహమ్మారితో అల్లాడుతున్న నల్లగొండ జిల్లా ప్రజలను ఆ బాధ నుంచి విముక్తి కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీటిని అందించి ఫ్లోరైడ్‌ను తరిమికొట్టారన్నారు. కారు గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### బతుకమ్మలతో ఘన స్వాగతం

ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కోలాటం, డప్పు దరువులతో ర్యాలీ నిర్వహించారు. బతుకమ్మలు, బోనాలతో పాటు దారిపొడవునా కూసుకుంట్ల మీద పూల వర్షం కురిపించారు. జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ సభ్యుడు పొనుగోటి అంజన్‌రావు, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మునగాల నారాయణరావు, వెంకటేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్, మాజీ ఎంపీపీ అనంతరాజు గౌడ్, సర్పంచులు నల్ల యాదయ్య, కల్లు స్వాతీనవీన్‌రెడ్డి, కుంభం నర్సమ్మామాధవరెడ్డి, ఎంపీటీసీలు ఊరిపక్క సరితానగేశ్, శిలువేరు విష్ణు, కట్కూరి వెంకటేశ్, దళితబంధు డైరెక్టర్ లపంగి నర్సింహ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, నాయకులు ఐతగోని వెంకటయ్య గౌడ్, గంట కృష్ణ, చెర్కు లింగంగౌడ్, మారగోని రామన్న, పందుల పాండు, పూరె రమేశ్, ఐతగోని అశోక్, వర్కాల వెంకటేశ్, రేనుకుంట్ల నరేందర్, మార్నేని అంతయ్య, కొంపెల్లి నాగరాజుగౌడ్, జంపాల జయప్రసాద్, రాపోలు యాదగిరి, సైదులు యాదవ్ రామిడి వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.



మర్రిగూడ : లెంకలపల్లిలో ఎమ్మెల్యే సభకు భారీగా హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

# పూటకో పార్టీ మార్చే వాళ్లకు ఓటు అడిగే అర్హత లేదు

## ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



నామాపురంలో ఎమ్మెల్యే ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

గట్టుప్పల్ : పూటకో పార్టీ మార్చి ప్రజలను మోసం చేసే వారికి ఓట్లు అడిగే అర్హత లేదని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నామాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బులతో ప్రజలను మాయ చేసి గెలువాలని చూస్తున్న కోమటిరెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. గట్టుప్పల్ మండలం ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. మండల ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి ఆయన రుణం తీర్చుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అద్భుతమైన మ్యానిఫెస్టోను అమలు చేస్తుందన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి బీమా, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం, సౌభాగ్యలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందనున్నాయన్నారు. ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతిల్లు ఇచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ప్రజలంతా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని, కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోమారు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మర్రిగూడ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, మర్రిగూడ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, ఎంపీటిసీ ఊరుపక్క సరితానగేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్‌యాదవ్, సహకార సంఘం చైర్మన్ బాలం నర్సింహ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బట్టు వెంకటేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్, బీఆర్ఎస్ నాయకులు సింగారపు భాస్కర్, బాలం వెంకటేశ్, శ్రీను, రాజు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల సతీమణి అరుణ

# మునుగోడు ఎమ్మెల్యేగా కూసుకుంట్లను గెలిపించాలి

చౌటుప్పల్, నవంబర్15 : మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిదే అని ఆయనను మరో మారు గెలిపించి మరింత అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల సతీమణి అరుణ, కుమార్తె రమ్య ప్రజలను కోరారు. బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేసిన అభివృద్ధిని వారు గుర్తు చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు రేవతీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ ఉడుగు మల్లేశంగౌడ్, వార్డు కౌన్సిలర్ బొడిగే ఆరుణా బాలకృష్ణగౌడ్, నాయకులు తొర్పునూరి నర్సింహగౌడ్, పోలోజు శ్రీనివాసాచారి, భీమనగోని మల్లేశ్‌గౌడ్, గంటా నరేంద్రసాగర్, రెడ్డగోని మల్లేశ్ పాల్గొన్నారు.



చండూరులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రూ.40 కోట్లతో చండూరు మున్సిపాలిటీ అభివృద్ధి

చండూరు, నవంబర్15 : చండూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని, రూ. 40 కోట్లతో ఇప్పటికే మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మున్సిపల్ కౌన్సిలర్ తోకల వెంకన్న అన్నారు. బుధవారం పట్టణంలోని 208 బూత్ పరిధిలో పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. రోడ్డు విస్తరణ పూర్తయి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు అనంతరం చండూరు కొత్త శోభను సంతరించుకోనున్నదని చెప్పారు. రాబోవు రోజుల్లో మరింత అభివృద్ధి జరుగాలంటే ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భూతరాజు దశరథ, డీసీసీబీ డైరెక్టర్ జూలూరు శ్రీనివాస్, మాస్టర్ వీవర్ల సంఘం అధ్యక్షుడు జూలూరు ఆంజనేయులు, నాయకులు ఇరిగి రామన్న, కర్నాటి అంజయ్య, ఇరిగి రామకృష్ణ, కర్నాటి మల్లేశ్ పాల్గొన్నారు.



దామెరలో కూసుకుంట్లకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

# దామెరలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నాంపల్లి : మండలంలోని దామెర గ్రామంలో బుధవారం మాజీ సర్పంచ్ పొలగోని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి ఆయనకు అండగా నిలువాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి యాదగిరిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బచ్చునబోయిన పెద్దులు, సంయుక్త కార్యదర్శి బొట్టు జగన్, పూదరి యాదయ్య, మండల శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మునుగోడు బరిలో 39 మంది

- 11 మంది నామినేషన్ల ఉపసంహరణ

చండూరు, నవంబరు15 : ఈనెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ బుధవారం ముగిసింది. మొత్తం 51 మంది నామినేషన్లు దాకలు చేయగా ఒక నామినేషన్‌ను అధికారులు తిరస్కరించగా 50 మంది మిగిలారు. బుధవారం 11 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దాంతో ఎన్నికల బరిలో 39 మంది నిలిచారు. సాయంత్రం అధికారులు స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. ఒక్క ఈవీఎమ్‌లో 16 మంది అభ్యర్థులు ఉంటారు. 39 మంది అభ్యర్థులతో పాటు నోటా కూడా ఉండటంతో ప్రతి పోలింగ్ బూత్‌లో మూడు ఈవీఎమ్‌లు ఉండనున్నాయి.

## బీఎస్పీ అభ్యర్థి నామినేషన్ విత్‌డ్రా

మునుగోడు నియోజకవర్గం బరిలో నిలిచేందుకు బీఎస్పీ తరపున నామినేషన్ వేసిన ఆందోజు శంకరాచారి బుధవారం తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. పార్టీ శ్రేణులకు తెలియకుండా ఆయన నామినేషన్ ఉపసంహరించుకున్నారని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శంకరాచారిని తప్పించడంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.